


# స్మరణి

[ కథానిక ]

= శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే =

అదొక చిన్న వూరు. ఆవూళ్లో వున్న చింతల తోపుకు మధ్యాన వున్న కుంటకు అవతల చిన్న చిన్న దుబ్బులు వుండివున్న ఖాళీప్రదేశానికి చివరగా వుంది కనకమ్మా, ఆరేళ్లకొడుకు వెంకటాద్రీ వున్న యిల్లు.

దగ్గరగా అటూ యిటూ కొన్ని యిళ్లు వున్నా, గుబురైన చింతలతోపు కావటంలో వెన్నెలరాత్రిళ్ల లోనే జీబుకుమంటుంటే, యింక చీకటి రాత్రిళ్లలో చెప్పనే అక్కర్లా. పుకుగూ బుడతా అంటూ తిరుగుతూ నిముషాని కోకేక పెడుతూవుంటై వింతవింతగా.

నల్ల పరదాపట్టాలలాగ చల్లచల్లగా మేఘాలు కమ్మి ఆరాత్రి వాన చిటపట పడ్తుంటే, కుంటఒడ్డున చేరి సంతోషంకొద్దీ గంతులేస్తూ వాలుగా వున్న ఓ బేరంకప్పను గభాల్న ఒచ్చి పట్టుకుంది ఓ గుమ్మడి మచ్చల జెర్రిపోతుపాము. కప్ప భయంతో బెకబెక అరుస్తూ కొట్టుకుంటున్నది అమ్మపక్కలో పొర్లుతున్న వెంకటాద్రిని కలతపెస్తూ.

"ఆ అరిసే దేంటే అమ్మా?"

"కప్ప నేందో పాము పట్టుకున్నట్టుంది!"

చటుక్కున అమ్మను కరుచుకున్నాడు వెంకటాద్రి, భయంతో ఒణుకుతూ.

"అమ్మా, బయమే!"

"బయం దేనికిరా, ఎంకూ?"

"సూడమ్మా ఎత్తా ఏడుత్తుందదో, ఆకప్ప?"

"నువు ఏడుత్తే నిన్నెవురు సూత్తారూ?"

"నువ్వేగామ్మా!"

"అమ్మ సచ్చిపోయిం దనుకో, అప్పుడూ?"

"మాఅమ్మ సచ్చిపోకేం! మాఅమ్మ మంచిదిగా?"

"మంచోళ్లే తొందరగా సచ్చిపోతారు ఎంకూ! నేను మంచిదాన్ని కాను."

"నువు మంచిదానివి కాకుంటే అత్తా, ఆపాము ఆకప్పను అత్తా సంపుతుంటే, నేను బయపత్తుండేవోన్ని కాదమ్మా!"

"మడుసుల్ని మడుసులు విరిసి సంపుక మింగి తింటుంటే, పాములూ కప్పలూ ఏంలెక్కలో కొచ్చి బయపెడతై, ఎంకూ?"

యీసారి మరీజాలుగా అరిచింది కప్ప.

"బయవేఁ, అమ్మా!" అంటూ బావురుమన్నాడు వెంకటాద్రి.

"సంపుతా, యదవా, బయం అన్నావంటే."

మరికొంచెం పొర్లింది వెంకటాద్రికడుపు నెరుస్తున్న ఆనీలాల కళ్లకుండా.

"ఎదవబతుకులు!" అన్నది కనకమ్మ, ఎంతో లోతునుండి.

"–ఆఁ?–" అన్నాడు వెంకటాద్రి అమ్మ మొహంకల్లి చూస్తూ ఆమాట తన కేమన్నా పనికొస్తుందేమో అన్నట్టు.

"నే నో సిన్న కతలాంటిది సెబుతా, యీపాలి సరీగ్గా యింటావా?"

"సెప్ – సెప్ – సెప్పమ్మా."

ఆకప్ప యింకోసారి ఆజాలిఅరుపు అరిచే ముందుగా అందులో కలిపి కనకమ్మ ఆ చిన్నకథను మొదలు పెట్టింది, కప్పరొద తెలియనీయకుండా.

■■ ■■ ■■

"అదొక సిన్న వూరు, ఎంకూ! ఆవూర్లో యిద్దరు పుగాకుయాపారస్తులుండారు. ఒకడేమో బాపనాయన. పేరు సూరయ్య. రెండోఆయన కాపు. పేరు ఏదవుతే ఏం! మొదుట్లో యీపుగాకుయాపారం సాగించింది కాపాయిన. పుగాకును ఆడీడ సౌక దరకు కొంటూ, దరలు లెగిసినప్పుడు బత్తీలలో వుండ ప్యాక్టరీలకు మంచిలాబంకాడికే సరఫరా సేత్తుండే వోడు. కమేనా ఆ లావాలపిూన మెట్టబూములు కొని సొంతగా లంకపుగాకు పండిచ్చి యీవూరిజనానికి యింకో సెబ్బరపుగాకు రానీకుండా, తన మంచిపుగాకును సరసంగా అమ్మతా, నలుగుర్లో కొత్తె పలుకుబడి సంపాదిత్తా, వుడిసే మంచోడుగనక మంచో డనిపించుకుండాడు ఆ నలుగురిసేత, యాపారం వృద్ది సేసుకుంటూ.

"అంతకుమునుపు ఆళ్లాళ్లకు ఏంయవారాలుండమ్యో మనకవుతే బాగా తెలవదు,– యిదంతా సూసి ఆ ఆశపాతక బాపనసూరయ్యకు కల్లు కుట్టినై. ఆ తప్పుడు లెక్కలూ, ఆ బూటాకోరుప్యాంసరీ నోట్లూ, ఆ తప్పుడెవారాలేందో ఆటితో కుదటన పడకూడదూ? వుఁహుఁ! అట్టా కాక తనూ సాగించాడు యీయాపారం, అంత మాగానిబూమి వుండా కడుపునిండక, పకోర్ల్లనోట్లో దుమ్మేసి ఆదుమ్ముమడుసుల్నే యిరిసి మింగుతేగాని తన కడుపాత్రం తగ్గదన్నట్టు.కోడియదవ! ఆ ఏరుకుతింటానికి ఎంత నైపోగు సెత్తయినాసరే–"

"పక్కింతి సెంచాయోల్ల కోళ్లు నైసెత్తనే కదమ్మా తింతం?" అన్నాడు వెంకటాద్రి మధ్యగా, తనకు తెలిసిందేదో.

"నువు మద్దెన కుంటిపెశ్నెలు ఎయ్యమాకు! చెంచాయికోళ్లు నైసెత్త తింటంలో గన తేం వుందీ! అది మడిసికోడి. కోడి కుండాల్సిన లచ్చనాలు అంతకు ఎక్కువగా యింకెవుర్లోనూ వుండవ్ – ఆడికితప్ప!" అని చీత్కారించింది కనకమ్మ ఆ లోపలవుండే మంట బయటపెడ్తూ.

"వుఁ!"

"వూఁ ఏముందీ! కమేనా సూరయ్య సాగించాడు పుగాకుయాపారం! ఆళ్లకేం, అత్తిపరులు. ఎంత యిట్టం లేకున్నా నలుగురూ ఆయినకు తాలం ఎయ్యకతప్పదు అవసరాన్ని బట్టి.బత్తీలల్లోనైనా ఆకోడి కూతలే కూసి పని సాగించుకున్నాడు ఎంత దగాయాపారానికన్నా పాలుబడ్డా. పుగాకుకరుజు ఎక్కువగా వుంటంవల్ల సరిపోయిందిగాని, బజార్నపడి బలానోడి యాపారం యింతని దగుల్బాజీయవారాలు నడిపిత్తుంటే, పదికూతల్లో ఓకూతన్నా నమ్మరూ, యిసే జనం? ఎందుకు నమ్మరూ? కాపాయిన ఎంత మంచోడనుకుండారో అట్టాగే అంత సెడ్డోడనుకుంటానికి ఏం నాయం అక్కర్లేకపోయినా సాలామటుకు సబబుగా వుంటుందిగాని, పుగాకుకరుజు ఎక్కువగా వుంటంవల్ల యిద్దరికీ పోటీతో పనిలేకుండా వుంటానికి యీ లుంటూండగా, సెరికొద్ది నాలుగుడబ్బులు తెచ్చుకుంటూండగా, సిన్నమొన్నటాయినకు గిట్టక అవతలోడు ఎందుకు బాగుపడాలని తడిగుడ్డలు సానబడ్తుంటే, దాని కేం నాయం.పాయం వుండక్కర్లా? మంచిసెడ్డ ఆడ ఏం యిశారించక్కర్లా?"

"వుఁ."

"అసలు తమాశా యాడుందంటే, 'ఏం కాపాయనా, బాగుండావా?' అంటాడు బాపనాయన. 'ఏందండీ సూరయ్యగారూ, మీరూ మీ

వోరంతా బాగుండారా?' అంటాడు కాపాయిన మొగం యింత సేసుకుని, యినయంగా. 'నీ యాపారం ఏమన్నా లాబంగా వుందంటోయ్?' అంటాడు సూరయ్య. 'మరేనండి. యాడదండీ, తమకు తెలవకుండా!' అంటాడు కాపాయిన గోల్లు గిల్లుకుంటా. 'యి యాల దరలు పెరిగినయ్యంట, ప్యాక్ట్రీకి బత్తాలు ఎత్తుదాం వేంటీ?' అంటాడు సూరయ్య. 'సిత్తం. మీరు నట్టబడ్తే నాకుమటుకు నట్టం తగల్దంటండీ?' అంటాడు కాపాయిన, యీ యవారం తన పెల్లానికి ఎంత యిట్టం లేందీ తెలవకుండా.

"ఓ రోజున కాపాయిన పెల్లాంతో అన్నాడు- 'మన లంకపుగాను మెరకబూమి రెట్టింపు దర కాడికి సూరయ్యగారు కొంటా నంటున్నాడు. అమ్మదామంటావా' అని, పెల్లానికి సెర్రు మనిపిత్తా. 'బాసే వుంది! మద్దెన నాదా ఎట్టా పెత్తనం? యాపారస్తుడివి నువుగాని, అదెట్టా తగలబడ్తే నాకేం! కాపాయిన యాపారం మలుపు తిరిగిందని నలుగు రనుకుంటుంటే అనుబవించేది నేనుగాని! మంచి దర లుండయ్యని నీ సేత యాపై కాడికి అమ్మిచ్చటం ఏందీ, యనకాడ్తే తను అరసై కాడికి రాబట్టుకోటం ఏందీ! యింతకు ముంగల యాపారానికీ, యిప్పటిదానికీ యాడన్నా సంబందం వుందీ? సేతులు యిరుసుకుని సంపాయించుకున్న బంగారం లాంటి బూమిని అమ్ముతాడంట! నీబూమి కొని, ఆవుండ బత్తాలు కొని ప్యాక్టరీల్లో, వూళ్లల్లో నీ పేరు ఎనకేత్తుంటే, యింకా కొన్నిరోజులకు యీ కాపాయిన మొగం సూడను ఎవురికి పడ్తుందీ, బలాన సూరయ్య అంటారుగాని! ఆడు నిన్న పాతాళ్లోకానికి అనగ తొక్కతుండాడని వూళ్లో అ తమందీ అనుకుంటుండా నీకు తెలవకుండా పోతుండదేం? కాపుదొరలకు యాపారా లెందుకోయ్ అనికాదూ నే బావికాడి కెళ్లి నీలు తెత్తుంటే ఆ పెద్దమడిసి బజార్లో అంటుండదీ? అయ్యో డాత! ఎనకటికిమల్లే బలాన యాపారస్తుడి బార్యేనని యికముందు సెప్పుకు మురిసే బాగ్గెం నాకు పట్టుంది గనక తగుదునమ్మాంటు సెప్పనొచ్చావా!' అని పెల్లాం బాగా సూరిపో సేతలికి మల్లీ తెప్పరిల్లుకుని కొత్తె దారిన పడ్డాడు కాపాయిన.

"ఓపాలి పరీచ్చగా సూరయ్యకళ్లల్లో సూదులు గుచ్చుకున్నట్టు,ఆఏడు కాపాయినపుగానుపంట బంగారపు పంట పండింది, బారెడుబారెడు పాయలేసుకుని. ఆపంట తన కమ్మమన్నాడు సూరయ్య. కట్టపడి పండించిన ఆపంటమీన తనకే యెక్కువ అబిమానం వుందన్నాడు కాపాయిన, తన పెల్లాం యింటే మురిసేటట్టు. 'నీకెంత అబిమానం వుందీ నాకుమటుకు తెలవదంట్రా? మాటసా మెతకు అడగాల్సొచ్చిందిగాని!' అని ఎల్లిపొయ్యాడు సూరయ్య, పళ్లు కొరుక్కుంటా.

"మరసనాడు కాపాయిన మెట్టబూమికాడికెళ్తే ఏముందీ? యింకో రెండుదినాలల్లో పాకానికి రానుండ ఆబంగారపు పాయలంతా గొడ్డమంద సీలికలు సీలికలుగా తొక్కి కంవిలిపరిసివుండయ్యా మెట్టబూమి సేలంతా.

"కళ్లెంట నీటిబొట్లను బొటబొట జారుత్తా సేలను యాన నెత్తిన సేతు లేసుకుని వలవల ఏకదారగా కాపాయిన ఏడుత్తుంటే, పక్కన వుండే సుంకోళ్ల పిల్లో డొచ్చి సెప్పాడు 'సూరయ్యగోరి జీతగాడు ఎంకయ్య ఆళ్ల బర్రెలమందతో రేత్రి మెట్టదిబ్బలమీన సాలా సేపు ఆడుకుండాడని.

"ఆకాకమీన కాపాయిన పోయినపోటం సేతికందిన ఓ ఒసికర్ర వూడబెరుక్కుని వూళ్లోకి లగెత్తుకుంటా ఎల్లి, అప్పుడే సూరయ్యయింటోనుండి బయటికొత్తుండ ఎంకయ్యను రాత్తామీన పడేసి ఒల్లు సితగకొడ్తుంటే ఆడు పెట్టిన రొదకు నలుగురూ సేరి తన్ను పెడరెక్కలు యిరిసి పట్టుకుండేంతవరకూ తెలవలా అసలు తనేం సేసిందీ.

"యీ సమాచారమంతా కడుపుతో వుండ కాపాయిన పెల్లాం యిని ఎంకయ్య తిన్న దెబ్బలకన్న ఎంత ఎక్కువగా బాద అనుబవించిందీ ఆబగమంతుడికే తెలవాలి.

"ఆరేత్రికి కాపాయినను మునుసబు కొట్టో పెట్టి మరసనాడు బత్తీకి తీసికెల్లారు యిశారనకు

గాను. 'ఏపనైనా యిశారించకుండా అంత తొందర పడి సేయకూడదు. పాపం, ఎంత అబిమానస్తుడు! ఏం సిచ్చ యిదిస్తారో' అని ఆసూరయ్య ఎంత యిశారం వన్నా పడ్డాడు, సేయవలసిన యవారమంతా పొందిగ్గా సాటున సేసుకుంటూ, కొత్తె డబ్బు కరుజయినా యవారం ఎనకకు పానీకుండా.

"ఒళ్లుపగిలిన ఎంకయ్యకు యిప్పట్లో సావు రాదని డాక్టర్లు పూసీయిచ్చినాక, పబిలీగ్గా రాత్తామీన ఓ నిండుమడిసిని కూనీ సెయటానికి పెయత్నించినందుకుగాను కాపాయినకు ఏడేళ్లు కటినసిచ్చ వేశారు.

"యింక పుగాకు మెట్ట తన కేంపట్టిందీ! వూళ్లో ఎవురేం అనుకుంటుండదీ తన కేం కావాలి! ఏదో పున్నెం సేసుకుని ఆసూరయ్యగారు యింత తెరిపిన పడగలిగాడుగాని, తను యాపారి పెల్లాన్నని ఎంత కాడికైనా అనిపించుకోగలిగినందుకే తనకు పదివేలు అని కాపాయిన పెల్లాం మతి సెడి పలవరిత్తుంటే, ఓదార్చను సూరయ్యగారొచ్చాడు.

"'యిశారించి లాబం లేదమ్మా! ఒత్తూవుంటై కట్టాలు! నే సెప్పిన మాట యినవయ్యా అంటే యిన్నాడా? యింత అలజడి వుండేదా అప్పుడు? యిప్పుడికైనా నీకు అబ్బెంతరం లేకపోతే, ఆబూమిని నువు నాకు అమ్ముకోవచ్చు. ఎవురన్నా సూసేవల్లినోళ్లు వుండాలనిగాని అంతకన్న మరేం లేదు. నువు నెమ్మదిగానే తెలియసెయ్యొచ్చులే!' అని సల్లగా తన సనుగుడు బయిటపెట్టాడు. 'అయ్యా, మీరు సేసిన వుపకారానికి ఒచ్చే జనమలో ఎటూ నేను మీ కడుపున పుట్టకతప్పదు. యిప్పటికి యీ జనమకు మమ్మల్ని యిట్టా పోనిత్తే, ముందుకు మీఅంతి మంచి సూరయ్యలుండరు' అని ఏడ్సింది కాపాయిన పెల్లాం నోట బలంపోయి.

"ఆ ఏడేళ్లూ బగమంతుడిమీన బారం ఏసి ఎట్టాగైనా గడపాలనుకుంది కాపాయిన పెల్లాం, తన కడుపున పుట్టిన సిన్న కాపాయినతో.

"ఆ కాపాయినమీనుండే బెమకు పెల్లానికి ఆశె అంటూ ఏమాత్రం వుండా, సిన్న కాపుకు నాలుగో ఏడు నిండకతలికే ఆముచ్చటకూడా తీరింది. కొట్లో పడ్డ కాపాయినకు యిశారాన్న తుయదగ్గ తగిలి, తీసుకుంటునట్టు తెలుత్తే, మరసనాడు నైకుంట ఏకాశసంగా పిల్లోణ్ణి బుజానేసుకుని వూరికి దచ్చినపు దిక్కుగా ఏడుత్తూ ఎళ్లింది పెల్లాం కాపాయిన దక్కతా డసే బెమకొద్దీ.

"ఆమూడోరోజు రేత్రికే సిన్న కాపుతో తిరిగొచ్చేసింది కాపాయిన పెల్లాం కుంటా, సెట్లూ, దుబ్బలూ దాటుకుంటూ, ఆ జీబుకుమంటుంస యింటోకి.

"ఓ ఏడాదిపాటు ఏమీ తెలవని సిన్న కాపుతో ఎల్లబోసుకుంది తన సొద, తా, కడాకు తన గుండె రాయికిమల్లె మారేంతవరకు. గుండె నీరవుతుండ ఆ రోజుల్లో పుట్టావు. అందుకనే నీగుండె అట్టా ఏడ్చింది ఆకప్పఅరుపు యిని. యింకా ముందుముందు యీ మడుసుల అరుపులు నీగుండె ఏవిదంగా బరిస్తుందో !–"

■ ■ ■

వెంకటాద్రికి ఎప్పుడు నిద్ర పట్టిందో! కప్ప అరుపు వినపడటంలా. ఎప్పటిమోస్తరు బయట ఏమి కాకుండా వుంది ఆగడియకు తగ్గట్టు.

